నమస్తే తెలంగాణ

# కరీంనగర్

3 | కరీంనగర్, ఆదివారం 17 మార్చి 2024 | KARIMNAGAR




చొప్పదండి: మోడీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



గోదావరిఖని: చౌరస్తాలో నిరసనలో పాల్గొన్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ నాయకులు



- నియోజకవర్గకేంద్రాలు దద్దరిల్లేలా ధర్నాలు
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
- నల్ల బ్యాడ్జీలు ధరించి నల్లజెండాలతో నిరసనలు
- కేంద్రం, మోడీ దిష్టిబొమ్మల దహనాలు
- 'మోడీ డౌన్ డౌన్.. ఈడీ డౌన్ డౌన్' నినాదాలు
- ఇది గులాబీ పార్టీని దెబ్బతీసే రాజకీయ కుట్రంటూ విమర్శలు

**బీఆర్ఎస్ దళం భగ్గుమన్నది.** ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ అగ్రనాయకురాలు కల్వకుంట్ల కవిత అక్రమ అరెస్టుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. శనివారం ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలతో హోరెత్తించింది. నల్ల బ్యాడ్జీలు ధరించి, నల్ల జెండాలు చేతబట్టి రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపింది. కేంద్రం, మోడీ దిష్టిబొమ్మలు దహనం చేసి, 'మోడీ డౌన్ డౌన్.. ఈడీ డౌన్ డౌన్' అంటూ నినదించింది. ఈడీ తీసుకున్న అసంబద్ధ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూనే, బీఆర్ఎస్ నాయకులపై ఎన్ని అక్రమ కేసులు బనాయించినా భయపడేది లేదని స్పష్టం చేసింది. కాగా, ఆయాచోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా నాయకులు పాల్గొని, ఈడీ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. ఇదంతా కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు కలిసి ఆడుతున్న డ్రామా అని, కేసీఆర్, బీఆర్ఎస్‌ను బలహీనపరిచేందుకే ఇలా అరెస్టుల పేరిట బెదిరింపు రాజకీయాలకు దిగుతున్నదని మండిపడ్డారు. రెండేళ్ల పాటు నిరీక్షించి ఎన్నికల సమయంలోనే ఎందుకు అరెస్టు చేయాల్సి వచ్చిందో మోడీ ప్రభుత్వం జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. కేసులకు భయపడేది లేదని, ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటామని స్పష్టం చేశారు.

- కరీంనగర్, మార్చి 16 (నమస్తే తెలంగాణ)



కరీంనగర్: తెలంగాణచౌక్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# అరెస్టుపై ఆగ్రహజ్వాల

## ఎమ్మెల్సీ కవిత ఈడీ కస్టడీపై భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు



కొడిమ్యాల: నినదిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ నాయకులు





పెద్దపల్లి: ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, నాయకులు



ధర్మపురి: జాతీయ రహదారిపై నినదిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. మానకొండూర్‌లోని పల్లెమీది చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణుతోపాటు నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రసమయి బాలకిషన్ మాట్లాడుతూ, కవిత అక్రమ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు. ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటామని స్పష్టం చేశారు. హుజూరాబాద్‌లోని అంబేద్కర్ చౌరాస్తాలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. చొప్పదండి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో నిరసనలు తెలుపగా, గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, చొప్పదండిలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, రామడుగులో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.





సిరిసిల్లలో నినదిస్తున్న నాయకులు, కార్యకర్తలు







మానకొండూర్ రూరల్: నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ నాయకులు


# మోగిన పార్లమెంట్ నగారా

- ఎన్నికల షెడ్యూల్ విడుదల
- రాష్ట్రంలో నాలుగో విడుతలో ఎన్నికలు
- ఏప్రిల్ 18న నోటిఫికేషన్
- మే 13న పోలింగ్.. జూన్ 4న కౌంటింగ్
- అమల్లోకి వచ్చిన కోడ్
- వేడెక్కిన రాజకీయ వాతావరణం
- శంఖారావం పూరించిన బీఆర్ఎస్
- కరీంనగర్, పెద్దపల్లి అభ్యర్థులుగా వినోద్ కుమార్, కొప్పుల ఈశ్వర్
- నేటికీ అభ్యర్థులను ప్రకటించని కాంగ్రెస్

పార్లమెంట్ ఎన్నికల నగరా మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం శనివారం షెడ్యూల్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఏడు విడుతల్లో ఎలక్షన్లు ఉండనుండగా, రాష్ట్రంలో నాలుగో విడుత జరుగనున్నాయి. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ రానుండగా, మే 13న ఎన్నికలు జరుగనున్నాయి. జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉండనుండగా, షెడ్యూల్ విడుదలతో అప్పుడే రాజకీయాలు వేడెక్కాయి. ఇప్పటికే బీఆర్ఎస్ కరీంనగర్, పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థులను ప్రకటించి, కలిసొచ్చిన కరీంనగర్ గడ్డ వేదికగా శంఖారావం పూరించగా, శ్రేణులు నూతనోత్సాహంతో ముందుకెళ్తున్నాయి.



కరీంనగర్, మార్చి 16 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం శనివారం షెడ్యూల్ విడుదల చేసింది. నాలుగో విడుతలో మన రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించనుండగా, వచ్చే నెల 18న నోటిఫికేషన్ ఇవ్వనున్నది. అదే రోజు నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. మే 13న పోలింగ్ నిర్వహించి, జూన్ 4న ఓట్లు లెక్కించనున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి కరీంనగర్, పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఓటరు జాబితాను వెల్లడించారు. రాజకీయ పార్టీల సమక్షంలో ఈవీఎం మిషన్లను పరిశీలించారు. ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.





### అమల్లోకి కోడ్

షెడ్యూల్ విడుదలైన మరుక్షణం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఇది ఎన్నికల ప్రక్రియ ముగిసే నాటికి అంటే.. జూన్ 6వ తేదీ దాకా కొనసాగనున్నది. శనివారం రాత్రి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, కోడ్ పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు జిల్లాల ఎన్నికల అధికారులు (కలెక్టర్లు) ప్రకటనలు జారీ చేశారు. అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, కోడ్ పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని చెప్పారు. జిల్లాలో ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు విధిగా పాటించాలని సూచించారు. ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూం, చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆదివారం నుంచి ప్రత్యేక బృందాలు విధులు నిర్వహిస్తాయని తెలిపారు.



ఓదెల: గుంపులలో చెక్ పోస్ట్‌ను ప్రారంభించిన సీఐ సుబ్బారెడ్డి

### రాజకీయ వేడి

కొద్ది రోజుల నుంచే రాజకీయ వేడి రాజుకుంటున్నది. తాజాగా షెడ్యూల్ విడుదలతో ఒక్కసారిగా మరింత వేడెక్కింది. అన్ని పార్టీల కంటే ముందుగానే బీఆర్ఎస్ కరీంనగర్, పెద్దపల్లి అభ్యర్థులను ప్రకటించింది. ఇదే కరీంనగర్ వేదికగా లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టింది. అనంతరం బీజేపీ కూడా తమ పార్టీ అభ్యర్థులుగా కరీంనగర్‌కు బండి సంజయ్‌ని, పెద్దపల్లికి గోమాస శ్రీనివాస్‌ను ప్రకటించింది. కానీ, కాంగ్రెస్ మాత్రం ఇప్పటి వరకు ఎవరినీ ప్రకటించలేదు. అసలు పోటీలో ఎవరిని దింపుతారనేది స్పష్టత రాలేదు. అభ్యర్థుల విషయంలో ఆ పార్టీ మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలుస్తున్నది.

### బీఆర్ఎస్ అభ్యర్థుల ఖరారు

కాంగ్రెస్ సర్కారు తీరుపై ఇప్పటికే ప్రజల్లో అసహనం వ్యక్తమవుతున్నది. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు సాగు, తాగునీటికి కష్టాలు మొదలు కావడం, వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోవడంతో ఆగ్రహం కనిపిస్తున్నది. ఇప్పటికే రోడ్డెక్కి ఆందోళనకు దిగుతున్నారు. ఇటు ఎన్నికల ముందు ఆ పార్టీ 420కి పైగా హామీలిచ్చి మభ్యపెట్టిందని, వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని కొన్నింటినే ఇచ్చిందని ప్రజలు మండిపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిలుస్తున్నది. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ఏం చేస్తాయో తెలియని పరిస్థితి ఉండగా, పార్లమెంట్‌లో తెలంగాణ గొంతుక ఉండాలని భావిస్తున్నది. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిద్ధమైంది. అందులో భాగంగానే అన్ని పార్టీల కంటే ముందే ఎంపీ అభ్యర్థులను ప్రకటించింది. ఈ నెల 4నే మాజీ పార్లమెంట్ సభ్యుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు కరీంనగర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు పెద్దపల్లి టికెట్లు కేటాయించింది. ఉద్యమకారులు, సమర్థులు, సీనియర్ నాయకులైన వీరిద్దరికి అవకాశం కల్పించడంతో శ్రేణుల్లో హర్షం వ్యక్తమైంది.

### 'కదనభేరి'తో సమరోత్సాహం

అన్ని పార్టీల కంటే ముందే అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, తనకు కలిసొచ్చిన కరీంనగర్ గడ్డ నుంచే శంఖారావం పూరించారు. ఈ నెల 12న ఎస్సారార్ కళాశాల మైదానం వేదికగా కదనభేరి మోగించి, పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఆ బహిరంగ సభ గ్రాండ్ సక్సెస్ కావడంతో గులాబీ శ్రేణుల్లో సమరోత్సాహం కనిపిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన చేదు అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటూనే లోక్‌సభ ఎన్నికల్లో రెండు స్థానాలను కైవసం చేసుకునే దిశగా గులాబీ దళం అడుగులు వేస్తున్నది. ఇప్పటికే ఈ రెండు నియోజవర్గాల పరిధిలో అసెంబ్లీ సెగ్మెంట్లు, మండలాల వారీగా కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తూ.. నాయకులు దిశానిర్దేశం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించి కేడర్‌కు అందుబాటులో ఉంటున్నారు. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నాయకులతో కలిసి మంతనాలు జరుపుతూ గెలుపు కోసం వ్యూహాలు రచిస్తున్నారు. అబద్ధాలు, మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తీరును, వైఫల్యాలను వివరిస్తున్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ సోయి, ప్రజలపై ప్రేమ ఉన్న వ్యక్తులను గెలిపించుకోవాలని కేసీఆర్ పిలుపు ఇవ్వగా.. ఆ మేరకు ప్రతి కార్యకర్త నూతనోత్తేజంతో ముందుకు సాగుతున్నారు.



సిరిసిల్ల కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి



# అకాల వాన

వీర్నపల్లి: వన్‌పల్లిలో వడగండ్ల వానకు ఒరిగిన వరి



గంభీరావుపేటలో కురిసిన వడగండ్ల వాన

గంభీరావుపేట/ వీర్నపల్లి, మార్చి16: ఉమ్మడి కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల వడగండ్ల వానలు పడ్డాయి. ముఖ్యంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం అడవి పదిర, వన్‌పల్లి, గర్జనపల్లి, మద్దిమల్ల, గంభీరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన సుమారు గంటపాటు ఏకధాటిగా కురిసింది. గులకరాళ్ల కంటే పెద్దసైజులో వడగండ్లు పడడంతో చేతికచ్చిన వరిపంట నేలపాలైంది. దీంతో ఆరుగాలం శ్రమించి పండించిన పంట వర్షార్పణం కావడంతో రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని రోజుల్లో కోతలు మొదలు పెడుదామనుకుంటే ఇలా జరగడంపై కంటతడిపెట్టుకున్నారు. అకాల వర్షానికి నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

# అత్యాశకు పోయి.. నిండా మునిగి

## సైబర్ వలలో చిక్కుకొని 86వేలు పోగొట్టుకున్న మహిళ

సారంగాపూర్, మార్చి16 : యాడ్స్ పోస్టు చేస్తే డబ్బులు వస్తాయని ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ప్రకటన చూసి ఓ మహిళ సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన ఘటన జగిత్యాల జిల్లాలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సారంగాపూర్ మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన మమతారాణి ఇన్‌స్టాగ్రామ్ వాడుతున్నది. అయితే 'మా కంపెనీ ప్రకటనలను మీ వాట్సాప్ గ్రూపుల్లో ఎంతమందికి పంపిస్తే అంత మొత్తంలో డబ్బులు వస్తాయి'అని ఇన్‌స్టాలో వచ్చిన యాడ్ చూసింది. నిజమే అని నమ్మి, తన వాట్సప్ గ్రూపుల్లో యాడ్స్‌ను పోస్టు చేసింది. దీంతో కంపెనీ వారు మమతారాణి అకౌంట్లో రూ.400 ఒకసారి, రూ.500 మరోసారి జమ చేసి ఆశచూపారు. తర్వాత కంపెనీ వారు ఫోన్ చేసి 'మీరు రూ.వెయ్యి జమ చేస్తే పెద్ద కంపెనీల ప్రకటనలు పంపేలా ప్రమోట్ చేస్తామని' చెప్పారు. మరోసారి రూ.3 వేలు పంపిస్తే ఇంకా ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించారు. ఇలా పలుమార్లు ఫోన్ చేయడంతో మమతారాణి దపదఫాలుగా రూ.86 వేలు పంపింది. ఆ కొద్దిసేపటికే కంపెనీవారి ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయానని గుర్తించింది. శనివారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా, ఫోన్ నంబర్ల ఆధారంగా సైబర్ క్రైం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపతి పేర్కొన్నారు.